గుట్టలో వైభవంగా లక్ష పుష్పార్చన


పుష్పార్చన చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూలై31: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో బుధవారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని లక్ష పుష్పార్చన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల సహస్రనామ పఠనాలతో అర్చకబృందం, వేద పండితులు వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలోని కల్యాణ మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవంలో అత్యంత వైభవంగా సాగింది. సాయంత్రం వేళలో స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 11,34,384ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశికధర్మకర్త బి.నరసింహ మూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

యాదగిరిగుట్ట అభివృద్ధిలో ఎమ్మెల్యే విఫలం

- సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట, జూలై31: యాదగిరిగుట్ట దేవస్థాన అభివృద్ధిలో స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పూర్తిగా విఫలమయ్యారని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసి గుట్టను దేశంలోనే గొప్ప క్షేత్రంగా అభివృద్ధి పరిచిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 8 నెలల కాలంలో ఎమ్మెల్యే 3 సార్లు దేవస్థాన అధికారులతో సమీక్ష జరిపి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కొండపైన అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సింది పోయి, అవినీతి ఆరోపనలు ఎదుర్కొంటున్న దేవస్థాన ఉద్యోగుల బదిలీలను నిలిపివేసేందుకు అసెంబ్లీ వేదిక ప్రభుత్వాన్ని కోరడం సరికాదన్నారు. దేవస్థానంలో సుమారు 20 ఏండ్ల నుంచి ఉద్యోగుల బదిలీలు లేవన్నారు. ఉద్యోగుల అవినీతిపై ప్రస్తుత ఈఓ భాస్కర్‌రావుకు సైతం వినతిపత్రం ఇచ్చామన్నారు. దేవస్థాన బదిలీల అంశంపై సీపీఐ శాసన పక్షనేత కూనంనేని సాంబశివరావుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు కళ్లెం కృష్ణ, బబ్బూరి శ్రీధర్, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య, నాయకులు పాల్గొన్నారు.

మోటకొండూర్‌లో కేంద్ర శిక్షణ అధికారుల పర్యటన

పీహెచ్‌సీని సందర్శించిన సెంట్రల్ ట్రైనీ అధికారులు

మోటకొండూర్, జూలై 31: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఐకేపీ, వర్క్షాప్‌లోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీసెస్ ట్రైనీ అధికారులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. పరిపాలన పరమైన విధానాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశమయ్యారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీసెస్ అధికారులు పవర్‌దీప్‌సింగ్, ఓంప్రకాశ్ ఓజ, రోమన్‌కుమార్ జైన్, కమలేశ్‌కుమార్ మీన్, ఎంపీడీఓ ఇందిర, మండల వైద్యాధికారి విజయ్, ఏపీఎం సత్యానారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు చౌకబారు ఆరోపణలు మానుకోవాలి

- బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశం

రాజాపేట, జూలై 31 : కాంగ్రెస్ నాయకులు చౌకబారు ఆరోపణలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు కటకం వెంకటేశం అన్నారు. బుధవారం మండలంలోని రఘునాథపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రఘునాథపురం ప్రత్యేక మండల ఏర్పాటుపై చర్చకు కాంగ్రెస్ నాయకులు ముందుకు రావాలన్నారు. గ్రామపంచాయతీ వద్ద చర్చ పెడదామని, నిజాలేమిటో ప్రజలకు చెబుదామన్నారు. తనపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను మానుకోవాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కొండ రాజు, మాజీ సర్పంచ్ గుర్రం సిద్దిరాములు, రామిండ్ల నరేందర్, కటకం స్వామి, పల్లె ప్రవీణ్‌కుమార్‌గౌడ్, డొంకెన మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి : ఎంఈఓ

తుర్కపల్లి :సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ కృష్ణ

తుర్కపల్లి, జూలై31 : ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ జె. కృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోధనా సామర్థ్యాలను పెంచుకోవాలి

బొమ్మలరామరం : ఉపాధ్యాయులు నిరంతరం బోధనా సామర్థ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి జె.శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం మాట్లాడారు. త్వరలో కేంద్రం ప్రభుత్వం నిర్వహించనున్న నేషనల్ అచీవ్‌మెంట్ టెస్ట్‌కు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఎంఈఓ కృష్ణ, మండల నోడల్ అధికారి రోజారాణి, జీహెచ్ఎం వరలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు తడక రాజు, రేపాక గిరిధర్‌రెడ్డి, వెంకటలక్ష్మి, జయలక్ష్మి, శ్రీదేవి, కృష్ణవేణి, రిసోర్స్ పర్సన్ బి.రమేశ్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని.. విద్యార్థి ఆత్మహత్య

బొమ్మలరామారం, జూలై31 : మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన బాలుడు కొమ్ము చంద్రశేఖర్(14) బుధవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్ము చంద్రశేఖర్ మండల కేంద్రలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సక్రమంగా వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దాంతో మనస్తాపానికి గురై బుధవారం ఉదయం ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లాడు. గ్రామ సమీపంలోని మామిడిచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి దావీదు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంజయ్య తెలిపారు.

ప్రతిభావంతులను గుర్తించేందుకే 'ఇంటింటా ఇన్నోవేటర్'

- జిల్లా యువజన క్రీడల అధికారి ధనుంజనేయులు

ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతున్న ధనుంజనేయులు

భువనగిరి అర్బన్, జూలై 31: ప్రతిభావంతులను గుర్తించేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి కె.ధనుంజనేయులు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం నిర్వహించనున్న ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు బుధవారం విద్యార్థులతో కలిసి వాక్‌ఫర్ ఇన్నోవేషన్ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వాక్ ఫర్ ఇన్నోవేషన్ కార్యక్రమం గ్రామీణ స్థాయిలో ఆవిష్కరణలను వెలికి తీస్తుందన్నారు. ఈ కార్యక్రమం ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువత భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈఓ ప్రశాంత్‌రెడ్డి, జిల్లా ఇన్నోవేషన్ కో-ఆర్డినేటర్ వడ్డేపల్లి సుధీర్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాపిరెడ్డి, సీడీలు పాల్గొన్నారు.

గుట్ట అభివృద్ధికి నిధుల కేటాయింపుపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- 8 నెలల్లోనే అవినీతిలో కూరుకుపోయిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య
- బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, జూలై31: యాదగిరిగుట్ట అభివృద్ధికి నిధుల కేటాయింపుపై స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.2వేల కోట్లతో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని పునర్నిర్మించి అద్భుతంగా అభివృద్ధి చేశారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కనీసం రూపాయి కూడా కేటాయించలేదని పేర్కొన్నారు. పైగా యాదగిరిగుట్ట అసలు అభివృద్ధి చెందలేదని అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలో మీడియాతో మాట్లాడారు. గుట్టలో జరుగుతున్న అవినీతిపై త్వరలో అఖిలపక్షంతో ధర్నా నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచిందని, ఇప్పటి వరకు ఎమ్మెల్యే ఎంత అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. కొండపైన 140 దేవస్థాన సత్రాలు కోల్పోయామని ఎమ్మెల్యే మాట్లాడారని, వెంటనే వాటిని వెలికితీయాలని డిమాండ్ చేశారు. ఒక్కప్పుడు దేవస్థాన ఉద్యోగులను బదిలీ చేయాలని పట్టుబట్టిన ఎమ్మెల్యే ఇప్పుడు మాటమార్చి బదిలీలను నిలిపివేయాలని అసెంబ్లీ సాక్షిగా దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను కోరడం వెనుక ఆంతర్యమేమిటో చెప్పాలన్నారు. ఉద్యోగుల బదిలీలను ఆపేందుకు ఎమ్మెల్యే రూ.2 కోట్లు దండుకున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కోట్లు ఖర్చు చేసి గుట్టను అభివృద్ధి చేయడంతో పాటు కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ రోడ్డు నిర్మించారని, ఇప్పుడొచ్చిన ఎమ్మెల్యే తామే నిర్మించినట్లు షో చేస్తున్నారని అన్నారు. 100 ఏళ్ల నుంచే యాదగిరిగుట్ట దేవాలయంలో స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున గిరిప్రదక్షిణలో వందలాది మంది భక్తులు పాల్గొంటారని గుర్తు చేశారు. గంధమల్ల జలాశయాన్ని నిర్మిస్తామని, తాపసుపల్లి జలాశయం నుంచి గోదావరి జలాలను ఆలేరు నియోజకవర్గానికి అందిస్తామని ఇచ్చిన హామీని ఎమ్మెల్యే నిలబెట్టుకోవాలన్నారు. 8 నెలల్లోనే బీర్ల అయిలయ్య లంచగొండి ఎమ్మెల్యేగా పేరు సంపాదించుకున్నారని విమర్శించారు. ఇంత తక్కువ కాలంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏకైక ఎమ్మెల్యేగా ఆయన చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. స్వామివారితో రాజకీయాలు చేస్తున్న ఆలేరు ఎమ్మెల్యే పతనం ఖాయమన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ నాయకులు

పాండవుల భాస్కర్‌గౌడ్, గంజి సూర్యనారాయణ, ఎండీ అన్వర్ పాల్గొన్నారు.

9 నుంచి అష్టభుజి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

భూదాన్‌పోచంపల్లి, జూలై 31 : మండలంలోని దేశ్ముఖి సాయి బృందావనంలో ఉన్న అష్టభుజి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆగస్టు 9 నుంచి 11 వరకు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంట నారాయణస్వామిజీ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు 9న గణపతి పూజ, పుణ్యవాచనం, అఖండ దీప ప్రజ్వలన, 10న అభిషేకాలు, పుష్పార్చన, చండీ హోమం, 11న సత్యనారాయణస్వామి వ్రతాలు, శివ పార్వతుల కల్యాణం, మూలమష్టి హోమం, మహా పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

2, 3 తేదీల్లో భువనగిరిలో నీటి సరఫరాకు అంతరాయం

భువనగిరి అర్బన్, జూలై 31: వచ్చేనెల 2,3తేదీల్లో భువనగిరి పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ సైనిక్‌పురి నుంచి భువనగిరి పట్టణానికి వచ్చే మేయిన్ పైప్‌లైన్‌కు మండలంలోని అనంతారం సమీపంలో, కుషాయిగూడలోని దమ్మాయిగూడ వద్ద మరమ్మతులు చేస్తున్నందున నీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని గమనించి పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

దండుమల్కాపురంలో తాళం వేసిన ఇంట్లో చోరీ

చౌటుప్పల్, జూలై 31 : తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని దండు మల్కాపురం గ్రామపరిధిలోని బొర్రోలగూడెంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ములుగు భాస్కర్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో బంధువుల అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి బీరువాలోని రూ.9లక్షల నగదు, 12 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బుధవారం ఇంటికి వచ్చిన బాధితుడు తన ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏసీపీ మధుసూదన్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

ఆత్మకూరు(ఎం), జూలై 31 : గురువారం నుంచి ప్రారంభం కానున్న తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. వారోత్సవాల్లో భాగంగా అన్ని కేంద్రాల్లో పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల నమోదును పెంచాలని సూచించారు. సమావేశంలో అంగన్వాడీ టీచర్లు ధనమ్మ, శ్రీవాణి, లక్ష్మి, స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్స్ జాక్ వైస్ చైర్మన్‌గా సత్యనారాయణ

సత్యనారాయణ

భువనగిరి కలెక్టరేట్/ఆత్మకూరు(ఎం), జూలై 31 : టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా మండలంలోని వీరవెల్లి జిల్లా పరిషత్ ఉపాధ్యాయుడు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తొంట సత్యనారాయణను ఎన్నుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని టీఎన్‌జీవోస్ భవనంలో 23 ఉపాధ్యాయ సంఘాలతో ఏర్పాటు చేసిన టీ జాక్ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ఉపాధ్యాయ సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు

భూదాన్‌పోచంపల్లి, జూలై 31 : అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని జిబ్లక్‌పల్లి గ్రామంలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు సామాజిక భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని, కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, గ్రామపంచాయతీ, మున్సిపల్, మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు, కార్మికులు పాల్గొన్నారు.

మార్కండేశ్వర ఆలయ కార్యవర్గం ఎన్నిక

ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ పాలకవర్గం

భూదాన్‌పోచంపల్లి, జూలై 31: పట్టణంలోని మార్కండేశ్వర ఆలయ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీత సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా భారత ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా అంకం యాదగిరి, కోశాధికారిగా ఇంజమూరి యాదగిరి, ధర్మకర్తలుగా చిక్క వెంకటేశం, గుర్రం కృష్ణ, వనం కృష్ణ, జిట్టా చంద్రమౌళి, మెరుగు యతీనందం, నక్క రామచంద్రం, ఐటిపాముల నాగేశ్, పెండెం పాండు, బడుగు బాలమణి, గుండు జయలక్ష్మి, దునక పద్మావతి, పొట్టబత్తిని శిరీష ఎన్నికయ్యారు. కార్యక్రమం పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, మున్సిపల్ చైర్ పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, ఆలయ చైర్మన్ బడుగు చండీకేశ్వర్, కౌన్సిలర్ భోగ భానుమతీవిష్ణు, నాయకులు పాల్గొన్నారు.

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

- అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొటేశ్వర్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న కొటేశ్వర్‌రావు

ఆలేరురూరల్, జూలై31 : ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ విప్ ఐలయ్య ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నేరవేర్చాలని అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. కొటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం ఆలేరు పట్టణ కేంద్రంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచినా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయం ఎత్తకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్. జనార్దన్, నాయకులు బెజాడి కుమార్, చిరబోయిన రాజయ్య, సీత, వెంకటేశ్ పాల్గొన్నారు.

కేసుల సంఖ్య ఆధారంగానే సబ్‌కోర్టు ఏర్పాటు : ప్రభాకర్

రామన్నపేట, జూలై 31 : రామన్నపేట కోర్టు పరిధిలో నమోదైన కేసుల సంఖ్య ఆధారంగానే సబ్‌కోర్టు మంజూరైందని, ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జూలై 20న వెలువడ్డాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జినుకల ప్రభాకర్ తెలిపారు. బుధవారం రామన్నపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. త్వరలోనే కోర్టును ప్రారంభించే అవకాశం ఉందన్నారు. ఆస్పత్రి స్థాయిని వంద పడకలకు పెంచడంతో పాటు, సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయడానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆయనవెంట ఎండీ జమీరొద్దీన్, వనం చంద్రశేఖర్, గోదాసు పృథ్వీరాజ్, ఆకవరపు మధుబాబు, ఎండీ అక్రం పాల్గొన్నారు.

రక్తదానంతో ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం

- జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు

రక్తదానం చేస్తున్న న్యాయవాదులు

భువనగిరి అర్బన్, జూలై 31: రక్తదానంతో ఒకరి ప్రాణాన్ని కాపాడవచ్చని జూనియర్ సివిల్‌జడ్జి నాగేశ్వర్‌రావు అన్నారు. ఐలూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎండీ.ఇస్మాయిల్ ప్రథమ వర్ధంతి సందర్భంగా బుధవారం భువనగిరి కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆపదలో ఉన్న వారికి, తలసేమియా బాధితులకు సమయానికి రక్తం అందించక పోతే ప్రాణాపాయం కలుగుతుందని, రక్తదానం చేయడం వల్ల వారి ప్రాణం నిలుపవచ్చన్నారు. అంతకు ముందు ఇస్మాయల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బురి హరినాథ్, ఐలూ జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు వంచ దామోదర్‌రెడ్డి, గోరుపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పైల్ల లింగారెడ్డి, శ్రీకాంత్, వారాల నర్సిరెడ్డి, కె. సోమయ్య, బొల్లపల్లి కుమార్, చింతల రాజశేఖర్‌రెడ్డి, బొడ్డు కిషన్, సురకంటి జంగారెడ్డి, ఎండీ. నెహాల్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి ఘన నివాళి

నర్సయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

వలిగొండ, జూలై 31: వలిగొండ మాజీ ఎంపీపీ తుమ్మల నర్సయ్య ప్రథమ వర్ధంతిని బుధవారం ఆయన స్వగ్రామం నర్సయ్యగూడెంలో నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ పాల్గొని నర్సయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండలానికి తుమ్మల నర్సయ్య అందించిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూతి రమేశ్‌రాజ్, కేశిరెడ్డి దయాకర్‌రెడ్డి, నాయకులు కందాల రామకృష్ణారెడ్డి, తుమ్మల దామోదర్, పాశం సత్తిరెడ్డి, తుమ్మల యుగంధర్‌రెడ్డి, చిట్టెడి జనార్దన్‌రెడ్డి, బండారు నర్సింహారెడ్డి, కుంభం విద్యాసాగర్‌రెడ్డి, వెంకట పాపిరెడ్డి, సామ రాంరెడ్డి, పబ్బు శ్రీనివాస్, పల్సం సతీశ్, తుమ్మల సంతోశ్, సురేశ్ పాల్గొన్నారు

ముగిసిన పారంపర్య వైద్య శిక్షణ శిబిరం

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు జ్ఞాపికను అందిస్తున్న పారంపర్య వైద్య మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహారుషి

యాదగిరిగుట్ట, జూలై31: పారంపర్య వైద్య మహాసంఘం ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట పట్టణంలోని పద్మశాలి నిత్యాన్నదాన సత్రంలో మూడురోజులుగా నిర్వహించిన శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ముగింపు వేడుకల్లో శివశక్తి పీఠాధీశులు శివస్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. సనాతన సంప్రదాయాల్లో భాగమైన ఆయుర్వేదానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చేందుకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పారంపర్య వైద్య మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దొంతయాత్రి మహారుషి, ప్రధాన కార్యదర్శి ఆరూరి బాల నర్సయ్య, ఉపాధ్యక్షుడు రామంచి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ సింహాచలం లక్ష్మణస్వామి, సభ్యులు భావ భానుప్రసాద్, చల్లా భానుప్రసాద్, ఉప కోశాధికారి వేమరాజు అరుణ, అరుణావతి పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం : సీఐ

రక్తదాన శిబిరంలో పాల్గొన్న సీఐ వెంకటేశ్వర్లు

రామన్నప